# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [4]

~ అద్దంకి అనంత రామయ్య



**సీరియల్:** సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [4]

**రచన:** అద్దంకి అనంత రామయ్య

**ప్రచురణ:** కినిగె పత్రిక patrika.kinige.com

**కాలం:** జనవరి 2014

**శాశ్వత లింకు:** http://patrika.kinige.com/?p=970

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [4]

*అత్యధికంగా అమ్ముడుపోయిన ఈ-పుస్తకంగా పేరు తెచ్చుకున్న "రామ్@శృతి.కామ్" రచయిత అద్దంకి అనంతరామయ్య రాసిన రెండవ హాస్య నవల ఈ "సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం". దీన్ని వారం వారం సీరియలైజ్ చేస్తున్నాం.* ***ఇది నాల్గవ భాగం.***

దీని ముందుభాగం

చల్లని గాలి,రకరకాల పూలు చెట్ల నుండి వీచే సువాసన పక్షుల కిలకిలలతో వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నది.అంతా నిశ్శబ్దం. అజయ్ ఆ మంచం మీద వెనక్కు వాలిపోయి ఆలోచనలో పడ్డాడు. గొడవపడ్డ మేనేజరు గురించి,తారసపడ్డ లావణ్య గురించి, ఇలా ఆలోచిస్తూ, మెల్లిగా మగత నిద్రలోకి జారుకున్నాడు. పది నిముషాల తర్వాత వెంకటరావు తన పని పూర్తిచేసి వచ్చి,అజయ్ ని తట్టాడు. "భలే నిద్ర పట్టేసిందిరా ! రాత్రంతా నిద్ర లేదు కదా" అన్నాడు అజయ్, చెరిగిపోయిన జుట్టుని దువ్వుకుంటూ. "ఎన్ని రోజులుంటావ్?" అడిగాడు వెంకటరావు. "ఆదివారం రాత్రి బయలుదేరాలి . సోమవారం నుంచి మళ్లీ మామూలే కదా !" అన్నాడు అజయ్.

పెంకు పంచలోకి వెళ్లి , రెండు పెద్ద జామకాయలు తెచ్చి, చెరొకటి ఇస్తూ , "చెట్టు కాయలురా" అని అన్నాడు వెంకటరావు. "కాయలు చెట్లకు కాయకుండా మనుషులకు కాస్తాయా? కాసినా వాటిని మనం తినగలమా? నువ్వు నీ అతి" అని అజయ్ అనటంతో , ముగ్గురూ ఒక్కసారిగా నవ్వారు . ఇంతలో అజయ్ కి నిషా నుండి ఫోను వచ్చింది. "రాత్రికి చేస్తాను, అప్పుడైతే ప్రశాంతంగా మాట్లాడవచ్చు" అని చెప్పి ఫోను పెట్టేశాడు. అప్పటికే సాయంత్రం ఆరు కావస్తున్నది. "నేను ఇంటికి వెళ్లి నేరుగా షాపుకు వచ్చేస్తా . నాన్న ఇంటికి వచ్చేస్తుంటారు. ఉదయం కనీసం పలకరించలేదు. కాసేపు ఇంట్లో కనపడి వస్తాను" అని చెప్పి గుప్తా బండి మీద ఇంటికి బయలుదేరాడు అజయ్. పొలం పని ముగియటంతో , వెంకటరావు గుప్తా కలిసి, గుప్తా కొట్టు దగ్గరకి చేరారు.

“సొంత ఇల్లు, ఇంటి ముందు కారు పట్టేంత ఖాళి స్థలం, ఇంటివెనుక నాలుగు మొక్కలు పెంచేంత ఖాళి స్థలం, సగటు మధ్య తరగతి కుటుంబం అజయ్ ది. ఇంటికి చేరేసరికి, వాళ్ళ నాన్నగారు తెల్లని లుంగీ ,బనియన్తో మడత మంచం మీద చల్లగాలికి కూర్చొని ఉన్నాడు. “ఎప్పుడొస్తాడు ,నీ స్నేహితుడు అమెరికా నుంచి ?” అని అడిగాడు “ఇందాకే వచ్చాడు నాన్న , కాసేపు ఆగి వెళ్లి కలవాలి” అని చెప్పాడు. “నువ్వు చెప్పా పెట్టకుండా వచ్చే సరికి ,ఖంగారు పడ్డాను. ఎందుకు వచ్చావో అని” అన్నాడు. అజయ్ ఉలకలేదు, పలకలేదు. “ఎలా ఉంది ఉద్యోగం ,పని ఒత్తిడి విపరీతంగా ఏమీ లేదు కదా?” అని అడిగాడు. “పెద్దగా ఒత్తిడి ఏమీ లేదు నాన్న. నెలకొక వారం రోజులు పని బాగా ఉంటుంది. మిగతా రోజులు మామూలే” అని చెప్పాడు. ఇద్దరూ కలిసి ఇంట్లోకి వెళ్లారు.తనకోసం అప్పుడే చేస్తున్న పకోడీల వాసన, ముక్కుకి బలంగా తాకటంతో వంటింట్లోకి వెళ్ళాడు.అక్కడే వంట చేసే గట్టు పైన కూర్చొని పకోడీలు ఒక్కొక్కటి తినటం మొదలుపెట్టాడు.”ఇంకా ఏంటి హైదరాబాదు విశేషాలూ ?” అని వాళ్ళ అమ్మ అడిగింది.హైదరాబాదుకేమి హాయిగా ఉందంటూ, తినటం పూర్తి చేసి నేరుగా CM దగ్గరకు వెళ్ళాడు.

పెళ్ళిళ్ళు ,పండుగల కాలం కాకపోవటంతో, కొట్టు మొత్తం ఖాళీగానే ఉన్నది. కాని CM మాత్రం చాలా హడావుడిగా లెక్కలు చూసుకుంటున్నాడు. తనకోసం వేసిన కుర్చీలో కూర్చున్నాడు అజయ్. పని చేసే కుర్రాడు గ్లాసులో మంచినీళ్ళు తీసుకొచ్చి అజయ్ కి ఇస్తూ “టీ నా కాఫీ నా అన్నా” అని అడిగాడు. “ఇప్పుడేమీ వద్దు తమ్ముడు మీ అన్న కప్పు టీ కూడా అప్పు కింద రాసి, వడ్డీ కూడా వేస్తాడు” అన్నాడు గుప్తా కేసి చూస్తూ. ఆ మాటకు గుప్తా కోపంగా ముఖం మార్చి, ఆ కుర్రవాడిని “ఏరా ,ఒళ్ళు ఎలా ఉంది? సాఫ్ట్ వేర్ వాళ్ళు ఎప్పుడు పడితే అప్పుడు, ఏది పడితే అది తాగుతారనుకున్నావా ఏంటి? చల్లని కోకో , చిల్డ్ బీరో అడగాలి కాని” అని అనటంతో అంతా నవ్వుల్లో మునిగిపోయారు.

గుప్తా అజయ్ వైపు తిరిగి " ఓ పది నిముషాలురా! లెక్క తేల్చి వస్తా" అన్నాడు. పరవాలేదు అన్నట్టు సైగ చేశాడు అజయ్. రోడ్డు మీద వెళ్ళే ఆటోల ,బస్సుల మోత బాగా వినిపిస్తున్నది. ఇవాళ రేపు, క్షణం తోచకపోతే అరక్షణంలో చేసే పని సెల్ ఫోనుతో ఆడుకోవటం. అజయ్ అమెరికా నుంచి ఇష్టంగా తెప్పించుకున్న ఐఫోనుని, ప్రేమతో తీసి చూస్తున్నాడు. అప్పటికే నిషా "ఏమి చేస్తున్నావు? మిస్సింగ్ యు" అని సందేశాన్ని పంపింది. "ఎవరిని ఏమి చేస్తే ఎవరు ఊరుకుంటారు ?" అని అజయ్ సమాధానం పంపాడు. "ఒకసారి చేస్తే కదా ఊరుకుంటారో లేదో తెలిసేది" అని నిషా పపింది. "చేసెయ్యరా బాబు, అంతలా అడుగుతున్నప్పుడు ఏదో ఒకటి చేసెయ్" అని వేణు వెనుకనుంచి అనటంతో అజయ్ ఉలిక్కి పడి వెనక్కి తిరిగి చూశాడు.

అప్పటికే అజయ్ సెల్లుని చాటుగా గమనిస్తున్న వేణుబాబు వికటాట్టహాసం చేశాడు. "ఏరా ఎంతసేపు అయింది వచ్చి" అని అడిగాడు అజయ్ వేణుని, తన సెల్ జేబులో దాచేస్తూ . "ఇప్పుడే వచ్చాలేరా! కంగారు పడకు ఇంతకు ముందువి చదవలేదు", అని నవ్వటం మొదలుపెట్టాడు. "ఆఫీసులో కలీగ్ రా! ఏదో సహాయం చేయమంటేను..." అని దీర్ఘం తీశాడు, తప్పించుకోవటానికి ప్రయత్నిస్తూ. "కలీగా, కలరింగా . . . అయినా నీ గొడవ నాకెందుకులేరా! నువ్వు ఏది చేయాలనుకుంటే అది చెయ్యి" అని వెటకారం చేశాడు. "ఇంకా ఏంటి విశేషాలు?" అన్నాడు అజయ్. "ఇందాకే వెంకటరావు చెప్పాడురా, సాఫ్టోడు సెలవులకు వచ్చాడని, ఒకసారి దర్శనం చేసుకొని వెళ్దామని వచ్చాను.. ఎలాగూ CM గారికి కూడా ముఖం చూపించినట్లు ఉంటుంది కదా" అన్నాడు వేణు, "చూపిస్తావు, చూపిస్తావు ఇవ్వాల్సిన డబ్బులు ఇమన్నప్పుడు, ఎక్కడ పెట్టుకు తిరుగుతావురా ఆ ముఖాన్ని?" అని CM అన్నాడు, తన పనిలోంచి కొంచెం బయటకు వచ్చి. "ఏ జన్మలో ఏ పాపం చేశానో , నీ దగ్గర అప్పు చేశాను" అన్నాడు వేణు .

"ఇంతకీ ఏంటి ఉన్నపళంగా ఊడి పడ్డావు ఏంటి సంగతి?" అడిగాడు వేణు, అజయ్ ని. "ప్రతి ఒక్కళ్ళు ఇదే ప్రశ్న అడుగుతారేంటో? నేను వచ్చానని ఆశ్చర్యం కన్నా అనుమానం ఎక్కువైపోయింది"

అనుకుని బాధపడ్డాడు అజయ్. ఈలోగా గుప్తా తన లెక్కలన్నీ సరి చూసుకుని చిట్టా పుస్తకాలన్నీ లోపల సర్ది, వీళ్ళ సంభాషణలోకి దూరాడు. “ఏరా! వీడికి కూడా ఏదో ఒకటి మీ కంపెనీ లోనే చూడచ్చు కదరా? తెగ బాధపడుతున్నాడు ఉద్యోగం రాలేదని” అని అన్నాడు గుప్తా అజయ్ తోటి, వేణు ని ఉద్దేశించి. “చికెన్ మొత్తం తినేసి, కోడి చచ్చిపోయిందే అని ఏడ్చాడంట! వీడిలాంటోడు. ఇంజనీరింగ్ అంతా గాలికి తిరిగి ఇప్పుడు బాధపడి ఏం లాభం?” అన్నాడు అజయ్. “వీడి బాధ నా గురించి కాదులేరా! నేను తీసుకున్న అప్పు గురించి. నాకు ఉద్యోగం కాకుండా ఒక 20 వేలు ఇప్పించు, వీడు జన్మ లో నాగురించి నీ దగ్గర మాట్లాడడు” అన్నాడు వేణు వ్యంగంగా. “ఐతే ఇవాళ సభ పెట్టుకుందామా?” అడిగాడు గుప్తా అజయ్ ని. ‘సభ’ అనగా ‘చతుర్ముఖ పారాయణం’. అర్థం అయ్యేట్టు అచ్చ తెలుగులో చెప్పాలంటే ‘పేకాట’ ఈ బాల్యమిత్రులందరికీ, క్రీడా స్ఫూర్తి దండిగా ఉండడంతో, మహత్తరమైన పేకను తమ అధికారిక క్రీడగా ఎంచుకున్నారు. రాత్రి తొమ్మిదిన్నరకు మొదలుపెట్టి తొంగొనేదాకా ఆడుతుంటారు. దాదాపు ఆ సభలన్నీ గుప్తా కొట్టులోనే జరుగుతుంటాయి.

అజయ్ ప్రయాణం చేసి అలిసిపోయి ఉండటంతో “ఇవాళ కాదు, రేపు పెట్టండి సభ, నాకు బడలికగా ఉంది” అన్నాడు అజయ్. “నేను ఎప్పటినుంచో మొత్తుకుంటూ ఉన్నాను, సాఫ్ట్ వేరోళ్ళ కోసం మన ఊరికి ట్రైన్ వేయించమని” అన్నాడు వేణు. “వీళ్ళ కోసం ఎందుకు వేస్తారు రా ట్రైన్?” అడిగాడు గుప్తా. “ఇంతకుముందు మన ఊర్లో ఇంటర్నెట్ పాయింట్లు ఉన్నాయా? సాఫ్ట్ వేరోళ్ళు సెలవులకొస్తే ఇబ్బంది పడతారని పెట్టించలేదూ! ఇది కూడా అంతే” అనటంతో అజయ్ ముఖం మండిపోయింది .మొదట్లో ఇలాంటివాటికి అజయ్ కి కోపం వచ్చినా తరువాత తరువాత అలవాటు అయిపోయింది. అప్పటికే సమయం తొమ్మిది కావోస్తున్నది .అజయ్ లేచి “నేను వెళ్తాను రా, రేపు మాత్రం సభకు సెలవు లేదని చెప్పండి” అంటూ ఇంటికి వెళ్ళాడు.

బండి లోపలి వెళ్తుండగా, పక్క ఇంట్లో ఉండే అతను “అజయ్,బాగున్నావా? ఎప్పుడొచ్చావు?” అని అడిగాడు. “ప్రొద్దున వచ్చా బాబాయి, ఆదివారం రాత్రికి వెళ్ళిపోతాను” అన్నాడు,మళ్లీ ఎప్పుడు

వెళ్తావు అనే ప్రశ్న ఎదురు కాకూడదు అనే ఉద్దేశంతో. స్టాక్ మార్కెట్ లో మంచి అవగాహన ఉన్న వ్యక్తి అతను. వ్యాపారంలో సంపాదించిన దాంట్లో ఎంతో కొంత ఈ స్టాక్స్ మీద పోగొట్టుకోవటం అతనికి పరిపాటి. "మార్కెట్ బాగా పడిపోయేట్టు ఉన్నదే, మీకేమి ఇబ్బంది ఉండదు కదా!" అన్నాడు. అజయ్ కి ఏమి మాట్లాడాలో అర్థం కాలేదు. "ఉద్యోగులను చాలామందిని తీసేస్తామంటున్నారు?" అన్నాడు. "ఎవరు తీసేస్తారన్నది?" అని అడగాలి అనుకొన్నాడు. కాని రాయేస్తే ముఖాన పడుతుందని భావించి, "మాకు ఇబ్బంది ఏమి ఉండదు బాబాయి" అన్నాడు. "మా అన్నయ్య కొడుకు రెండేళ్ళ క్రితం అమెరికా వెళ్లి అక్కడే సెటిల్ అయిపోయాడు, అంతకు ముందు "హైటెక్ సిటీ" లో పని చేశాడు" అని చెప్పాడు. "ఈ సోదంతా నాకెందుకురా బాబు" అనుకున్నాడు అజయ్. " నీకు అలాంటి అవకాశం లేదా? వెళ్లి రావాలి అబ్బాయి నువ్వు కూడా ,ఇండియాలో అనవసరం" అన్నాడు. అంతలోపు అజయ్ కి ఫోను వచ్చింది.ఆ ఫోను చేసినోడికో బ్లాంక్ చెక్కు రాసివ్వాలి అని ఆనందంతో అక్కడ నుండి మెల్లగా జారుకున్నాడు. "ఏమి చేస్తున్నావు?" అడిగింది నిషా. "ఉద్యోగం ఎలా సంపాదించాలా అని?" అన్నాడు. "అదేంటి, ఏమైంది నీ ఉద్యోగానికి?" అన్నది. "మార్కెట్ పడిపోయి, ఉద్యోగాలు పోతాయని మా మార్కెట్ బాబాయి చెప్పాడు" అనటంతో కిలకిలా నవ్వింది నిషా. ఆ నవ్వులో ఓ అరగంట మునిగాడు అజయ్.

తరువాత రోజు అజయ్ వాళ్ళ నాన్నగారికి భోజనం తీసుకొని బ్యాంకుకు వెళ్ళాడు. బ్యాంకు చాలా రద్దీగా ఉన్నది. నేరుగా తన తండ్రి దగ్గరకి వెళ్లి భోజనం ఇచ్చాడు. "మీ అబ్బాయా సార్ ! ఏమి చేస్తున్నాడు?" అని అడిగాడు, బ్యాంకు పని మీద వచ్చినతను. "హైదరాబాదులో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాడు అని చెప్పాడు కించిత్ గర్వాన్ని ప్రదర్శిస్తూ. "అవునా! ఎంతిస్తారు అబ్బాయి జీతం" అని అడగటంతో అక్కడున్నవాళ్ళంతా అజయ్ వైపుకు తిరిగి చూశారు, తనేదో నలభై ఏళ్ళు నడిచిన గొడవకు తీర్పు చెప్తున్నాడన్నట్టు. "నాకు ఎంతోస్తే వీడికెందుకు? పిల్లనిచ్చి పెళ్ళేమన్నా చేస్తాడా?" అని తిట్టుకున్నాడు. కానీ చెప్పక తప్పని పరిస్తితి "భోజనం పెట్టి రెండు వేలు ఇస్తారు. రెండుపూటలా టీ కూడా పోయిస్తారు" అనటంతో అంతా ఒక్కసారిగా నవ్వారు, అడిగినతనితో సహా. "తిక్క కుదిర్చావు"

అన్నట్టు చూసాడు అజయ్ వైపు వాళ్ళ నాన్నగారు. " మీలాగే మీవాడు కూడా మంచి చమత్కారండి" అని పొగిడాడు. నిజానికి అజయ్ వాళ్ళ నాన్నగారు చాలా తక్కువ మాట్లాడతారు. అనవసరంగా ఎవరితోనూ మాట్లాడరు. బ్యాంకులో పనులు చేయించుకొవటానికి ఇలా భజన చేస్తారు కాబోలు అనుకుని అజయ్ అక్కడి నుండి బయటకు జారుకొని నేరుగా గుప్తా దగ్గరకు వెళ్ళాడు.

"రాత్రి బాగా నిద్ర పట్టిందా దొరా? అక్కడ లాగా మా ఊర్లో ఏ.సిలు గట్రా ఉండవు కదా" అన్నాడు గుప్తా. అజయ్ ఏమి మాట్లాడలేదు. "పదా బ్యాంకు దాక వెళ్లి వద్దాం" అన్నాడు అజయ్ తో, డబ్బుల కట్టలను ఒక నల్లని బ్యాగులోకి సర్దుతూ. "ఇప్పుడు అక్కడ నుంచేరా రావటం, కాసేపు ఆగి వెళ్దాం" అన్నాడు అజయ్. "ఎక్కువ చేయకు రాజా! ఊర్లో మీ నాన్న చేసే బ్యాంకు ఒకటే కాదు, చాలా ఉన్నాయి" అంటూ లేచి బయటకు బయలుదేరారు. "ఏమి చేసుకుంటారురా అంత డబ్బు, నాలాగా లేని వాడికి ఇవ్వొచ్చు కదరా!" అన్నాడు అజయ్. "నీ దిష్టి తగిలేరా! వ్యాపారం దెబ్బతింది, పది రూపాయలకు కూడా కార్డులు గీకుతుండేసరికి, మీకు వెయ్యి రూపాయల కట్ట కూడా లక్ష లాగా కనిపిస్తుందేమో" అన్నాడు. "నిజమేరా, ఈ మధ్య డబ్బులు వాడటం చాలా అరుదు అయిపొయింది. ప్రతిదానికి ప్లాస్టిక్ కార్డు గీకటమే" అన్నాడు అజయ్. "అతిగా గీకకు, పుండు పడుతుంది" అన్నాడు గుప్త.

బ్యాంకు నుంచి తిరిగి వచ్చేసరికి సాయంత్రం నాలుగు అయ్యింది. వీళ్ళు వచ్చేసరికి అక్కడ రాజుగారు వీళ్ళద్దరి కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు. రాజు అనగా సత్యనారాయణరాజు , వయస్సులో మిగతా వాళ్ళ కన్నా రెండు మూడేళ్ళు పెద్దవాడు. బాగా ఆస్తి కలవాడు. చదువు రాక, వ్యాపారం కలిసిరాక, చివరకు రాజకీయాల్లోకి దిగాడు. రోజు ఉదయాన్నే ఖద్దరు బట్టలు తొడుక్కొని, పార్టీ కార్యాలయానికి వెళ్లి కాలయాపన చేయటం, సభలకు ధర్నాలకు జనాన్ని సమీకరించటం, పార్టీ తరపున మంచి పనులు చేయటం ఇలా చాలా రకాల 'టం' లు చేస్తుండటం ఇతని పని. గుర్తింపు

కోసం రోజు ఏదో ఒక వ్యవహారంలో వేలు పెడుతుంటాడు. కొన్ని సందర్భాలలో చెయ్యి విరగ్గొట్టుకుంటాడు.

రాజకీయం అంటేనే ఎదుటి వాడిని ఎప్పుడు ఏమని తిట్టాలా అని చూస్తుంటారు.అలాంటి రాజకీయాలను ఇప్పుడిప్పుడే రుచి చూస్తున్నాడు కదా, తనలో ఉన్న మంచి కన్నా, ఎదుటి వారిలో ఉన్న చెడు గురించే ఎక్కువ మాట్లాడుతూ ఉంటాడు. చిన్నప్పటి నుండి ఇంతే, తరగతి గదిలో గుంపు కట్టటం, వీడికి మార్కులు ఎక్కువ రాకపోయిన పరవాలేదు కాని, పగవాడు మాత్రం పాసు కాకూడదు అనుకునేవాడు. ఎలాగైనా పెద్ద నాయకుడైపోవాలని ఆశయంతో బతుకుతున్నాడు. అజయ్ రాజుగారిని చూడగానే "ఏం రాజుగారు ఎలా ఉన్నారు? మన ప్రభుత్వం, ప్రజలు ఎలా ఉన్నారు?" అన్నాడు. "నేను, నా ప్రభుత్వం అంతా బాగానే ఉన్నాము. ప్రజలే బలిసిపోయారు. నిన్న అనగా ఊరిలో దిగి ఇప్పటిదాకా కనపడలేదు" అని అజయ్ ని ఉద్దేశించి అన్నాడు. "అదేమీ కాదు రాజుగారు, మీరే ప్రజలకి అందుబాటులో ఉండటం లేదు" అన్నాడు. ఇద్దరూ అలా రోడ్డు మీద వచ్చి, రాష్ట్ర, దేశ, ప్రపంచ రాజకీయాల గురించి మాట్లాడుకుంటున్నారు. మాట్లాడుకుంటున్నారు అనటం కంటే, రాజు గారు చెప్తున్నాడు, అజయ్ ఆలకిస్తున్నాడు. సంకీర్ణ ప్రభుత్వాల గురించి సంక్లిష్టమైన సమాసాలతో వివరించాడు.

అప్పటికే సాయంత్రం ఏడున్నర అయ్యింది.గుప్తా,రాజు గారు,అజయ్ కలిసి రెండు హొండాల మీద ఊరికి ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న పంజాబీ దాబాకి వెళ్ళారు. బయట పెద్ద తొట్టిలో ఉన్ననీళ్ళతో ముఖం చేతులు కడుక్కొని లోపలికి వెళుతున్నారు. ఆ దాబా యజమాని నిజంగా పంజాబీ వాడు అవునో కాదో కానీ, హిందీ మాత్రమే వచ్చు. పరుగు పరుగున వీళ్ళకు ఎదురు వచ్చి రాజు గారిని చూసి "నమస్తే రాజా సాబ్ కైసే హాయ్ ఆప్ , బైటియే" అని నమస్కరిస్తూ పలకరించాడు. అక్కడ పని చేసే కుర్రాడిని కేకేసి "జాగ్రత్తగా చూసుకో" అని అర్థం వచ్చేలా చెప్పి వెళ్ళిపోయాడు.

అందరు కలిసి తలా రెండు రోటిలు తిని బయటకు వచ్చారు. దానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని చూపిస్తూ, "ఈ స్థలాన్ని రాజుగారు నేను కలిపి తీసుకొన్నాము అజయ్" అన్నాడు గుప్తా. "ఏమి చేసుకోవటానికి? ఏమి పండిస్తారు?" అన్నాడు. "ఛ! పండిస్తే ఏమోస్తుంది, మహాఅయితే పంట తప్ప, ప్లాట్స్ వేసి అమ్మటానికి తీసుకున్నాము" అనటంతో అజయ్ అవాక్కయ్యాడు. "ఇక్కడెవరు కొంటారు? అయినా ఇది పొలం కదా ?" అన్నాడు అమాయకంగా. " పిచ్చి డబ్బు ఉన్న సాఫ్ట్ వేరోడు ఎవడో ఒకడు కొంటాడులే, ఇవాల్టి పొలాలే రేపటి ప్లాట్లు అజయ్" అనటం తో అజయ్ కి అర్థం అయింది. కాని కనీసం ఊరు ఇంత పెరగటానికి కనీసం ఇంకో ముప్పై నలభై యేళ్ళు పడుతుందేమో" అన్నాడు అజయ్. "అవి మాకు అనవసరం" అని ముక్త కంఠంతో అన్నారు. తిరిగి గుప్తా కొట్టు దగ్గరకి చేరారు. అప్పటికే బాల్య మిత్రుల బృందంలో మిగిలిన సభ్యులు సిద్ధంగా ఉన్నారు. అజయ్ ,గుప్తా ,వేణు ,వెంకటరావు, రాజుగారు అంతా లోపలికి చేరారు.

[తరువాయి భాగం వచ్చే వారం]

For Latest Telugu Books - Visit now:
Kinige.com